



TGTEL/26/A2635

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



03

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 27 | 08-06-2026 సోమవారం | పేజీలు: 06 | వెల: 3/-

# ఓటరు కార్డు టెన్షన్!

లిస్టులో పేరు లేకుంటే రేషన్ కట్?
తెలుగు రాష్ట్రాల్లో రేగుతున్న భయాలు..
సోషల్ మీడియాలో 'ఓటరు లిస్టు' అబద్ధపు ప్రచారం
తీవ్ర ఆందోళనలో ఏపీ, తెలంగాణ ప్రజలు
ఓటు హక్కు పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దంటూ పుకార్లు
బెంగాల్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే భయాలకు కారణం
అక్కడ ఓటర్ల జాబితా నుండి ఏకంగా 63 లక్షల మంది తొలగింపు
అపోహలను కొట్టిపారేసిన ఎన్నికల సంఘం అధికారులు..
తప్పుడు వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి
ఆధార్.. ఓటర్ల లిస్టు సవరణకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడి
ఒకవేళ ఓటు తొలగించబడినా కంగారు వద్దు..
'ఫామ్-6' ద్వారా మళ్లీ పేరు నమోదుకు సువర్ణ అవకాశం

03





## మల్కాజ్‌గిరి నా రాజకీయ


# పునర్జన్మ..

రూ.1,511 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
మల్కాజ్‌గిరి ప్రజలకు సీఎం కృతజ్ఞతలు
ఫ్లైఓవర్లు, ఆస్పత్రి, రోడ్లకు శంకుస్థాపన
మూసీ ప్రక్షాళనతో యువతకు ఉపాధి

**హైదరాబాద్, (డిడి9 వార్త):** హైదరాబాద్ తూర్పు ప్రాంత రూపురేఖలను మార్చేలా ఉప్పల్ భగాయత్ లేఅవుట్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మొత్తం 1,511 కోట్ల రూపాయల విలువైన వివిధ మౌలిక ..మిగతా 2లో

# నేటి నుంచే బత్తిని చేప ప్రసాదం పంపిణీ

నాంపల్లిలో ఏర్పాట్లు పూర్తి!
మృగశిర కార్తెను సందర్భంగా చేప ప్రసాదం
నేడు రాత్రి 9 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పంపిణీ ప్రారంభం
మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి క్షేత్రస్థాయి పరిశీలన
ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, అధికారులతో కలిసి తనిఖీ
భక్తుల కోసం క్యూలైన్లలో భారీగా ఫ్యాన్లు, కూలర్లు, మంచినీటి వసతి
తొక్కిసలాట జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు..
దొంగతనాల అదుపునకు షీ టీమ్స్, సీసీ కెమెరాల నిఘా
అత్యవసర ఆరోగ్య పరిస్థితులను తట్టుకునేందుకు మెడికల్ క్యాంపులు
సీపీఆర్ ప్రత్యేక బృందాలు సిద్ధం
దాదాపు 176 సంవత్సరాలుగా సాగిస్తున్న సాంప్రదాయంపై మంత్రుల ప్రశంసలు
మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.4 లక్షల చేప పిల్లల పంపిణీ



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఆస్తమా, వివిధ రకాల దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు ప్రతి ఏటా ఎంతో నమ్మకంతో పంపిణీ చేసే ప్రసిద్ధ 'బత్తిని చేప ప్రసాదం' పంపిణీ కార్యక్రమానికి భాగ్యనగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. హిందూ సాంప్రదాయం ప్రకారం అత్యంత పవిత్రమైన మృగశిర కార్తెను ..మిగతా 2లో

# రేవంత్.. బీజేపీ శక్తి ఏంటో చూపిస్తాం

కిషన్ రెడ్డిని రాష్ట్రానికి రాకుండా అడ్డుకుంటారా?
మిమ్మల్నే ఈ రాష్ట్రం నుంచి తరిమి కొడతాం
బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు వెల్లడి
సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్య
తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భారీ నిధులు ఇచ్చిందన్న రాంచందర్‌రావు
రూ.13 లక్షల కోట్ల సాయంపై బహిరంగ చర్చకు సవాల్
అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణ
రైతుల భూముల సేకరణలో ప్రభుత్వం తీరుపై విమర్శలు
పరిహారం చెల్లించకుండానే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారని మండిపాటు
రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న బీజేపీ
రైతుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం
కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** రాష్ట్రంలో కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి పర్యటనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు. కిషన్‌రెడ్డిని పొలిమేర దాటనివ్వమంటూ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ రాంచందర్‌రావు తీవ్ర స్థాయిలో స్పందించారు. "కిషన్‌రెడ్డిని అడ్డుకుంటామని అంటున్నారు. మమ్మల్ని అడ్డుకునే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? ..మిగతా 2లో

# జూన్ 15 నుంచి బడులు ప్రారంభం

ముందుగా జూన్ 12న ప్రారంభించాలని నిర్ణయం
రెండో శనివారం, ఆదివారం కారణంగా షెడ్యూల్‌లో మార్పు
విద్యాశాఖ తాజా ఉత్తర్వులు
జూన్ 15 నుంచి తరగతుల ప్రారంభం
జులై 11న ప్రత్యేకంగా పాఠశాలల నిర్వహణ
రెండో శనివారం సెలవుకు బదులుగా క్లాసులు
విద్యార్థులు, ఉపాధ్యాయులకు సమాచారం
కొత్త విద్యా సంవత్సరానికి ఏర్పాట్లు పూర్తి
ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపు
పాఠశాలల ప్రారంభంపై స్పష్టత ఇచ్చిన విద్యాశాఖ

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన కీలక నిర్ణయాన్ని విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు జూన్ 15 నుంచి పునఃప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ముందుగా విడుదల చేసిన విద్యా క్యాలెండర్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు తెరవాల్సి ఉండగా, సెలవుల నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. జూన్ 13 రెండో శనివారం, జూన్ 14 ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వరుసగా ..మిగతా 3లో



# మీ పిల్లలను అమెరికా పంపొద్దు

అమెరికాలో తెలంగాణ యువకుడి హత్యపై కుటుంబ సభ్యుల ఆవేదన
పక్కా ప్రణాళికతోనే అన్నుల్ కుంచను హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
దోపిడీ కోసం కాదు.. ప్రాణాలు తీయడమే లక్ష్యమని అనుమానం
ఫేక్ పిజ్జా ఆర్డర్‌తో నిర్మానుష్య ప్రాంతానికి రప్పించారని వాపోయిన సోదరి
గతంలోనూ అన్నుల్‌పై దాడి జరిగినట్లు కుటుంబ సభ్యుల వెల్లడి
'మా తమ్ముడిని చంపేందుకే ఉచ్చు వేశారు' అంటూ కన్నీటి పర్యంతమైన తన్వి
అమెరికాకు పిల్లలను పంపొద్దంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి
వారాంతాల్లో పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్‌గా పనిచేసిన అన్నుల్
తలపై సమీపం నుంచి కాల్పులు జరిపిన దుండగులు
ఫేక్ ఆర్డర్ వెనుక ఉన్నవారిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



02

# గోదావరి జలాలపై ద్రోహం జరుగుతోంది

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు
బీఆర్ఎస్ పోరాటంతోనే బనకచర్ల ప్రాజెక్ట్ నిలిచిందన్న హరీశ్
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నామని వ్యాఖ్య
గోదావరిలో సర్‌ప్లస్ జలాలే లేవని స్పష్టం
పోలవరం నుంచి నీళ్లు మళ్లిస్తే తెలంగాణకు నష్టం
ఇచ్చంపల్లి లేదా సమ్మక్కసాగర్ నుంచి నీటి తరలింపునకు సూచన
తెలంగాణ వాటా వినియోగించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీరు ఇవ్వాలన్న డిమాండ్
కావేరీకి తరలించే జలాల్లో తెలంగాణకు సగం వాటా కోరిన బీఆర్ఎస్
ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా విమర్శలకు దిగుతున్నారని ఆరోపణ
గతంలో కృష్ణా, ఇప్పుడు గోదావరిలో అన్యాయం చేస్తున్నారని మండిపాటు
రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** గోదావరిబనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేయడంతోనే ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగకుండా నిలిచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకే ..మిగతా 3లో

## స్త్రీ రైడ్స్.. మహిళల ప్రయాణానికి

# మరింత రక్షణ

మహిళా ప్రయాణికుల కోసం తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రవాణా విప్లవం
హైదరాబాద్‌లో తొలి విడతగా రోడ్లపైకి వచ్చిన 55 మంది చైతన్య మహిళా డ్రైవర్లు
మహిళల భద్రత, సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యమే పరమావధిగా ఉపాధి పథకం
ఓలా, ఉబర్, రాపిడో అగ్రిగేటర్స్ యాప్‌లతో లేడీ డ్రైవర్ల అనుసంధానం
ఇదొక రవాణా సేవ మాత్రమే కాదు.. ఒక పెద్ద సామాజిక ఉద్యమమన్న డీజీపీ చారుసిన్హా
యుద్ధ విమానాలు నడిపే మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలన్న సీపీ సీవీ ఆనంద్
సొంత వాహనంతో పనివేళల్లో పూర్తి స్వేచ్ఛ, గౌరవం లభిస్తోందన్న ఆటో డ్రైవర్ కవిత
ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు సర్కార్ అండ.. భవిష్యత్తులో మరిన్ని నగరాలకు విస్తరణ



**హైదరాబాద్, (డిడి9 వార్త):** మహానగరంలో నివసించే మహిళా ప్రయాణికుల భద్రత, రక్షణ మరియు ప్రయాణ సౌకర్యాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక అద్భుతమైన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'స్త్రీ రైడ్' పేరుతో అధికారికంగా ప్రారంభమైన ఈ ప్రత్యేక ప్రాజెక్ట్ ద్వారా నగరంలోని మహిళలు ఇకపై ఎలాంటి భయాందోళనలు లేకుండా మహిళా డ్రైవర్లు మాత్రమే నడిపే కార్లు, ఆటోలు, అలాగే బైక్‌లలో ..మిగతా 2లో

## స్త్రీ రైడ్స్.. మహిళల ప్రయాణానికి మరింత రక్షణ

**మొదటిపేజీ తరువాయి**



అత్యంత సురక్షితంగా ప్రయాణించే సువర్ణ అవకాశం లభిస్తోంది. హైదరాబాద్ నగరంలో తొలి దశ కింద ప్రయోగాత్మకంగా 55 మంది శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లను రోడ్లపైకి అందుబాటులోకి తీసుకువచ్చారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం మహిళలకు భద్రత, సామాజిక సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యం అనే మూడు అత్యంత ప్రధానమైన లక్ష్యాలతో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తోంది. మహిళలు కేవలం గృహిణులుగానో లేదా చిన్న ఉద్యోగాలకే పరిమితం కాకుండా.. రవాణా రంగంలోనూ ఉపాధి అవకాశాలు పొంది, ఆర్థికంగా తమ కాళ్లపై తాము ధీరత్వంతో నిలబడేలా చేయడం దీని వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం. ఇందుకోసం డ్రైవింగ్ పట్ల ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఎంపికైన వారికి ప్రొఫెషనల్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడమే కాకుండా, పర్యావరణ హిత ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు కూడా ప్రభుత్వం తరఫున అవసరమైన ఆర్థిక సాయం, బ్యాంక్ లోన్ సహకారం అందించారు.

ఈ ప్రాజెక్టును కేవలం ప్రభుత్వ సేవలకు మాత్రమే పరిమితం చేయకుండా.. సామాన్యులకు మరింత వేగంగా చేరువ చేసేందుకు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కూడా జోడించారు. ప్రస్తుత కాలంలో నగరవాసులు విస్తృతంగా వినియోగిస్తున్న ఓలా, ఉబర్ , రాపిడో వంటి ప్రముఖ మొబిలిటీ అగ్రిగేటర్ డిజిటల్ యాప్‌లతో ఈ 'స్త్రీ రైడ్' డ్రైవర్లను అనుసంధానం చేశారు. దీనికోసం ఈ యాప్‌లలో ఒక ప్రత్యేక సాంకేతిక వ్యవస్థను రూపొందించారు. దీని ద్వారా ఎవరైనా ఒక మహిళా ప్రయాణికురాలు రైడ్ బుక్ చేసినప్పుడు, ఆ సమయంలో ఆమె ఉన్న ప్రాంతానికి సమీపంలో గనుక 'స్త్రీ రైడ్' మహిళా డ్రైవర్ అందుబాటులో ఉంటే.. ఆటోమేటిక్‌గా సిస్టమ్ ఆ రైడ్‌ను సదరు లేడీ డ్రైవర్‌కే కేటాయించేలా ఈ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశారు.

ఈ పైలట్ ప్రాజెక్ట్ మొదటి విడతలో భాగంగా సుదీర్ఘ స్క్రీనింగ్ అనంతరం మొత్తం 55 మంది చైతన్యవంతమైన మహిళలను ఎంపిక చేశారు. వీరిలో గల విభిన్న ఆసక్తులను బట్టి 50 మంది మహిళలను అత్యంత నైపుణ్యం కలిగిన బైక్ రైడర్లుగా, నలుగురిని ఆటో డ్రైవర్లుగా, ఒక మహిళను కార్ డ్రైవర్‌గా అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. కొన్ని ప్రముఖ స్వచ్ఛంద సంస్థల సామాజిక సహకారంతో వీరికి ట్రాఫిక్ నిబంధనలు, వాహన మరమ్మతులు మరియు ఆత్మరక్షణ విద్యల్లో ప్రత్యేక శిక్షణ అందించారు. అనంతరం ప్రధాన మొబిలిటీ సర్వీస్ ప్రొవైడర్లతో లింక్ చేయడం ద్వారా వారికి నిరంతరాయంగా స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించారు. దీనివల్ల మహిళలు తమ ఇళ్లలోని పనులను చక్కబెట్టుకుంటూనే, తమ వీలును బట్టి పనివేళలను ఎంచుకుని మంచి ఆదాయం పొందే చక్కటి అవకాశం ఏర్పడింది.

ఈ చారిత్రాత్మక కార్యక్రమం కేవలం నగరంలో నడిచే సాధారణ రవాణా సేవలకు మాత్రమే పరిమితమైనది కాదని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీజీపీ చారుసిన్హా స్పష్టం చేశారు. సమాజంలో మహిళల్లో దాగి ఉన్న ఆత్మవిశ్వాసాన్ని నిద్రలేపడం, వారికి పురుషులతో సమానంగా గౌరవప్రదమైన ఉపాధిని చూపడం, అలాగే పురుష ఆధిక్య రంగంగా భావించే రవాణా రంగంలో మరిన్ని కొత్త అవకాశాలను కల్పించడమే ఈ వినూత్న కార్యక్రమం యొక్క అసలైన అంతర్గత లక్ష్యమని కొనియాడారు. మహిళలు సాధించే ఆర్థిక స్వాతంత్ర్యం అనేది కేవలం వారి పురోగతికే కాకుండా.. వారి పిల్లల చదువులకు, వారి కుటుంబాల సమగ్ర సామాజిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆమె ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఈ 'స్త్రీ రైడ్' నూతన వాహనాల పంపిణీని ప్రారంభించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మహిళలను ఉద్దేశించి ఎంతో ప్రేరణాత్మకంగా మాట్లాడారు. ప్రస్తుతం మారుతున్న కాలంలో గిగ్ వర్క్ మరియు రవాణా రంగంలోకి మహిళలు ఈ విధంగా ధైర్యంగా అడుగుపెట్టడం నిజంగా ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ వృత్తిపరమైన ప్రయాణంలో రోడ్లపై ఎదురయ్యే చిన్న చిన్న సవాళ్లను, కష్టాలను గుండె నిబ్బరంతో ఎదుర్కొంటేనే జీవితంలో గొప్ప విజయం సాధించగలరని సుమధురంగా సూచించారు. మన దేశంలో మిగ్23, మిరేజ్ వంటి అత్యాధునిక శత్రు విధ్వంసక యుద్ధ విమానాలనే అవలీలగా నడుపుతున్న భారతీయ మహిళా ఫైటర్ పైలట్లను మన ఆడపడుచులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజ జనాభాలో సగం ఉన్న మహిళలు ఇలాంటి ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం కాకపోతే, దేశ మరియు రాష్ట్ర ప్రగతి కూడా సగానికి కుంటుపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ ప్రాజెక్టులో ఎంతో ఉత్సాహంగా భాగస్వామి అయి, కొత్తగా ఆటో స్టీరింగ్ పట్టిన లేడీ ఆటో డ్రైవర్ కవిత తన అంతరంగ అనుభవాన్ని ఆనందంగా పంచుకున్నారు. "గతంలో మేము చేసిన సాధారణ ప్రైవేట్ ఉద్యోగాల్లో చిన్న అవసరం వచ్చినా యజమానుల బతిమిలాడి, వారి అనుమతితోనే సెలవులు తీసుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు మాకు సొంతంగా వాహనం ఉండటం వల్ల, మా పని సమయాలను మా ఇష్టప్రకారం మేమే నిర్ణయించుకునే పూర్తి స్వేచ్ఛ మాకు లభించింది. ఇంట్లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా లేదా పండుగలు ఉన్నా పని నుంచి కొన్ని రోజులు విరామం తీసుకునే కుదురు దొరికింది. నా కుటుంబానికి గౌరవప్రదమైన రీతిలో ఆర్థిక భరోసా కల్పించాలనే బలమైన సంకల్పంతోనే నేను ఆటో డ్రైవర్‌గా మారేందుకు ముందుకు వచ్చాను" అని కవిత గర్వంగా వెల్లడించారు.

# మల్కాజ్‌గిరి నా రాజకీయ పునర్జన్మ..

**మొదటిపేజీ తరువాయి**

సదుపాయాల ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వేలాదిగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి సీఎం భావోద్వేగ ప్రసంగం చేశారు. తన ప్రతి సభలోనూ ఆడబిడ్డలకు ముందు వరుసలో కూర్చునే అవకాశం కల్పించాలని అధికారులకు సూచించిన ఆయన, మహిళల ఆశీస్సుల బలంతోనే తాను జడ్పీటీసీ స్థాయి నుంచి ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని కృతజ్ఞతలు చాటుకున్నారు.

**మల్కాజ్‌గిరి నా రాజకీయ పునర్జన్మ**

గతంలో కొడంగల్ నియోజకవర్గంలో తాను ఓటమి చెంది, రాజకీయంగా తీవ్ర ఎదురుదెబ్బ తిన్న తరుణంలో మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా గెలిపించి తనను ఆశీర్వదించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఐదేళ్లు తిరిగినా పూర్తికానంత పెద్దదైన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం ఒక 'మినీ భారతదేశం' లాంటిదన్నారు. కిందపడిపోయిన తనకు ఇక్కడి ఆడబిడ్డలు ఒక్క పైసా ఆశించకుండా ఓట్లు వేసి గెలిపించారని, ఆ ఎంపీ పదవి వల్లే సోనియా గాంధీ తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించారని తెలిపారు. ఈరోజు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడటానికి, తాను ముఖ్యమంత్రి కావడానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానమే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ సహకారం లేకపోవడం వల్లే ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, కాలం గిర్రున తిరిగి ఇప్పుడు సీఎం బాధ్యతలు చేపట్టడంతో ఆ లోటును భర్తీ చేస్తానని హామీ ఇచ్చారు.

**రూ.1,511 కోట్లతో రికార్డు స్థాయి మౌలిక వసతులు**

ఈ పర్యటనలో భాగంగా నగర ప్రయాణ సౌకర్యాలను, వైద్య రంగాన్ని బలోపేతం చేసేలా ముఖ్యమంత్రి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. 10 ఎకరాల విస్తీర్ణంలో 98 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏఓసి (AOC) సెంటర్ చుట్టూ 960 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.వాహనదారుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు టీకేఆర్ కాలేజ్ జంక్షన్ నుండి మందమల్లమ్మ జంక్షన్ వరకు 416 కోట్ల రూపాయలతో నిర్మించే 6 లేన్ల ఫ్లై ఓవర్ పనులను ప్రారంభించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో 37.50 కోట్ల రూపాయలతో ఉప్పల్‌లో నిర్మించనున్న 100 పడకల మల్కాజ్‌గిరి జిల్లా ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. దీనితో పాటు ప్రజలకు వైద్య సేవలను మరింత సులభతరం చేసేందుకు 'క్యూర్ వన్' (Cure One) అనే సరికొత్త మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.

**పాలనా వికేంద్రీకరణ – 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్**

హైదరాబాద్ నగరంలో గతంలో నాలుగు రకాల పరిపాలన సాగేదని, శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఆశించిన అభివృద్ధి జరగలేదని సీఎం విమర్శించారు. ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోటి 30 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని, వారికి అంతర్జాతీయ స్థాయి



మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' పేరుతో ఒక క్రమబద్ధమైన విజన్ డాక్యుమెంట్‌ను తీసుకువచ్చామని ప్రకటించారు. దీనిలో భాగంగానే పంపిణీ , పరిపాలనా సౌలభ్యం కోసం క్యూర్ (CURE) ప్రాంతాన్ని ఏర్పాటు చేసి, మూడు కొత్త మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేశామన్నారు. దీని వెనుక ఎలాంటి రాజకీయ స్వార్థం లేదని, కేవలం పాలనా వికేంద్రీకరణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఇకపై పోలీస్ , మున్సిపల్ శాఖల పరిధులు ఒకేలా ఉండేలా సమన్వయం చేశామని తెలిపారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడుకుందామని, మిగిలిన సమయంలో అభివృద్ధికి అందరూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రగతి కోసం రాజకీయాధికారాలు అడ్డురావని చెప్తూ.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పటికీ, ఉప్పల్ ప్రాంతానికి 40 ఏళ్ల పాటు సేవలందించిన ఆయన సోదరుడు దివంగత బండారు రాజిరెడ్డి జ్ఞాపకార్థం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు 'బండారు రాజిరెడ్డి కారిడార్'గా పేరు పెడుతున్నట్లు ప్రకటించి తన ఉదారతను చాటుకున్నారు. రోడ్లు, చెరువుల సుందరీకరణ, మెట్రో విస్తరణ ఇలా ఉప్పల్ ప్రాంతానికి ఏం కావాలన్నా నిధులు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

**మూసీ ప్రక్షాళనతో యువతకు ఉపాధి**

గుజరాత్‌లో సబర్మతి, యూపీలో గంగా, ఢిల్లీలో యమునా నదుల తరహాలో హైదరాబాద్‌లో మూసీ నదిని ఎందుకు ప్రక్షాళన చేయకూడదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు ఉన్న 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని అంతర్జాతీయ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తియితే నగర పర్యాటక రంగం పుంజుకోవడమే కాకుండా, స్థానిక యువతకు వేలాదిగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## రేవంత్.. బీజేపీ శక్తి ఏంటో చూపిస్తాం

**మొదటిపేజీ తరువాయి**



మా నాయకుల జోలికి వస్తే బీజేపీ శక్తి ఏంటో చూపిస్తాం" అంటూ హెచ్చరించారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చని, అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకుల పర్యటనలను అడ్డుకుంటామంటూ మాట్లాడటం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని, వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం భారీగా నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల మేర సహాయం అందించిందని ఆయన తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో, రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో ప్రజల ముందే చర్చిద్దామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని దాచిపెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. రైతుల సమస్యలపైనా రాంచందర్‌రావు స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కొంతమంది కాంగ్రెస్ నేతలు రైతుల భూములను కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. భూముల సేకరణ చేపట్టే ముందు రైతులకు తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పరిహారం చెల్లించకుండానే ఫ్రూట్ మార్కెట్ వంటి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం సరికాదని విమర్శించారు. రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. రైతుల హక్కులు, ప్రయోజనాలను కాపాడే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ ప్రజల తరఫున ఉద్యమిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించి, భూసేకరణలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

## నేటి నుంచే 'బత్తిని చేప ప్రసాదం' పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**



పురస్కరించుకుని, నేడు రాత్రి సరిగ్గా 9 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో (నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్) ఈ చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఎంతో ఘనంగా ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి శనివారం సాయంత్రం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు స్వయంగా చేరుకుని, అక్కడ భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, క్యూలైన్లను నిశితంగా పరిశీలించారు.

ఈ ఉన్నత స్థాయి పర్యటనలో మంత్రులతో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి సహా పలు ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ అంతటా తిరుగుతూ భక్తుల భద్రత మరియు సౌకర్యాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సాధారణంగా మృగశిర కార్తె ఉదయం పూట ప్రవేశించేదని, కానీ ఈసారి గ్రహాల గమనం ప్రకారం రాత్రి 9 గంటలకు కార్తె సమయం కుదిరిందని స్పష్టం చేశారు. దీనివల్ల 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి పంపిణీ ప్రారంభమై, మరుసటి రోజు అంటే 9వ తేదీ రాత్రి వరకు నిరంతరాయంగా, ఎలాంటి బ్రేకులు లేకుండా ఈ చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతుందన్నారు. రాత్రి వేళలో పంపిణీ మొదలవుతున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్ సౌకర్యాలు అద్భుతంగా ఉండాలని అధికారులకు సూచించారు.

రాత్రి సమయంలో భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో ఎలాంటి తోపులాట లేదా తొక్కిసలాట జరగకుండా పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని మంత్రి ఆదేశించారు. రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలు, పిక్ పాకెటింగ్ (జేబుదొంగతనాలు) జరగకుండా ఉండేందుకు నాంపల్లి మైదానంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ మరియు క్రైమ్ బ్రాంచ్ పోలీసులను రంగంలోకి దించుతున్నామని చెప్పారు.మైదానంలో ఏర్పాటు చేసిన వందలాది సీసీ కెమెరాల ద్వారా ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ నుండి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

ప్రస్తుతం నగరంలో వేసవి ఉక్కపోత మరియు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు తీవ్ర అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మైదానంలోని క్యూలైన్లు ఉండే అన్ని ప్రాంతాల్లో భారీ సంఖ్యలో పెద్ద ఫ్యాన్లు, వాటర్ కూలర్లు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే, పంపిణీ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, తాగునీటి ఎద్దడి రాకుండా జలమండలి ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా వచ్చే భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా భోజనాన్ని, అల్పాహారాన్ని అందించాలని మంత్రి కోరారు.

చేప ప్రసాదం కోసం వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోపలే ప్రత్యేక మెడికల్ క్యాంపులు, అత్యవసర ప్రాథమిక చికిత్స మందులు, అంబులెన్సులు మరియు ఫైర్ ఇంజన్ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా క్యూలైన్ల మధ్యలో ఎవరికైనా హఠాత్తుగా గుండెపోటు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఎదుర్కొనేందుకు వీలుగా 'సీపీఆర్' చేయడంలో ప్రత్యేక శిక్షణ పొందిన పారామెడికల్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నారు. ఈ బృందాలు స్ట్రెచర్లతో క్యూలైన్ల మధ్యలోనే తిరుగుతూ ఉంటాయని అధికారులు తెలిపారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఒక కేంద్రీకృత కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఒక ప్రత్యేక వాట్సప్ గ్రూప్ ద్వారా క్షణక్షణానికి సమాచారాన్ని మార్పిడి చేసుకుంటూ పర్యవేక్షించాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ నీరు అయిపోయినా, ఎక్కడ క్యూలైన్ ఆగిపోయినా తక్షణమే స్పందించేలా ఈ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. అలాగే మైకుల ద్వారా స్పష్టమైన సమాచారాన్ని భక్తులకు చేరవేయడానికి అధునాతన ఆడియో వ్యవస్థను సిద్ధం చేశారు. నాంపల్లి, మోజంజాహి మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సాధారణ ప్రజలకు ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్లు సిద్ధం చేయాలన్నారు.

మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. దాదాపు 176 సంవత్సరాలుగా బత్తిని హరినాథ్ గౌడ్ కుటుంబం ఎంతో ప్రతిష్టాత్మకంగా, నిస్వార్థంగా, రూపాయి ఆశించకుండా ఉచితంగా ఈ చేప ప్రసాదాన్ని ప్రజలకు అందిస్తూ వస్తోందని కొనియాడారు. ఈ సుదీర్ఘమైన, చారిత్రాత్మక సాంప్రదాయాన్ని గౌరవిస్తూ, ఈసారి తెలంగాణ మత్స్యశాఖ ద్వారా దాదాపు 1.4 లక్షల ఆరోగ్యకరమైన బతికున్న చేప పిల్లలను (ముర్రల్ ఫిష్) భక్తుల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి వచ్చే ప్రజలకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తరఫున అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా వచ్చి చేప ప్రసాదాన్ని స్వీకరించవచ్చని మంత్రులు భరోసా ఇచ్చారు.

## మీ పిల్లలను అమెరికా పంపొద్దు

- **అమెరికాలో తెలంగాణ యువకుడి హత్యపై కుటుంబ సభ్యుల ఆవేదన**
- **పక్కా ప్రణాళికతోనే అన్షుల్ కుంచను హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ**
- **దోపిడీ కోసం కాదు.. ప్రాణాలు తీయడమే లక్ష్యమని అనుమానం**
- **ఫేక్ పిజ్జా ఆర్డర్‌తో నిర్మానుష్య ప్రాంతానికి రప్పించారని వాపోయిన సోదరి**
- **గతంలోనూ అన్షుల్‌పై దాడి జరిగినట్లు కుటుంబ సభ్యుల వెల్లడి**
- **'మా తమ్ముడిని చంపేందుకే ఉచ్చు వేశారు' అంటూ కన్నీటి పర్యంతమైన తన్వి**
- **అమెరికాకు పిల్లలను పంపొద్దంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి**
- **వారాంతాల్లో పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్‌గా పనిచేసిన అన్షుల్**
- **తలపై సమీపం నుంచి కాల్పులు జరిపిన దుండగులు**
- **ఫేక్ ఆర్డర్ వెనుక ఉన్నవారిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అమెరికాలో దారుణ హత్యకు గురైన తెలంగాణ యువకుడు అన్షుల్ కుంచ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది సాధారణ నేర ఘటన కాదని, ముందుగానే పక్కా ప్రణాళిక రూపొందించి అమలు చేసిన హత్య అని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఫేక్ పిజ్జా ఆర్డర్ ద్వారా అన్షుల్‌ను నిర్మానుష్య ప్రాంతానికి రప్పించి దుండగులు కాల్చి చంపారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అన్షుల్ సోదరి తన్వి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. తన తమ్ముడిని చంపడానికే ప్రత్యేకంగా ఉచ్చు వేశారని ఆమె వాపోయారు. పిజ్జా డెలివరీ కోసం వచ్చిన ఆర్డర్ నిజమైనది కాదని, అది కేవలం హత్యకు దారితీసే ఉద్దేశంతో ఇచ్చిన ఫేక్ ఆర్డర్ అని తెలిపారు. "నా తమ్ముడిని ఎవరూ లేని ప్రాంతానికి పిజ్జా డెలివరీ ఇవ్వాలని పంపించారు. అక్కడికి వెళ్లిన తర్వాత అది కేవలం ఒక ట్రాప్ అని తెలిసింది. అక్కడ ఎవరూ లేరు. నా తమ్ముడిని చంపడానికే ఆ ప్లాన్ చేశారు. వాళ్ల ఉద్దేశం ఏమిటో, ఎందుకు ఇలా చేశారో మాకు తెలియదు. కానీ ఇది దోపిడీ కోసం జరిగిన ఘటన కాదని మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

ఘటన జరిగిన సమయంలో అన్షుల్ వద్ద ఉన్న నగదు, ఇతర వస్తువులు ఏవీ దుండగులు తీసుకెళ్లలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సాధారణంగా దోపిడీ కోసం జరిగే దాడుల్లో విలువైన వస్తువులు, నగదు అపహరించబడతాయని, కానీ ఈ ఘటనలో అలాంటిదేమీ జరగకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీంతో దుండగుల లక్ష్యం కేవలం అన్షుల్ ప్రాణాలు తీయడమే అయి ఉండొచ్చని భావిస్తున్నారు. అలాగే ఘటన జరిగిన ప్రాంతంలో బ్యాగులు ధరించిన ఇద్దరు ముసుగు వ్యక్తులు తిరుగుతున్నట్లు సమాచారం అందిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. గతంలో కూడా అమెరికాలో అన్షుల్‌పై ఒకసారి దాడి జరిగిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆ సమయంలో దుండగులు ఆయన వద్ద ఉన్న బంగారు గొలుసు, మొబైల్ ఫోన్, నగదు దోచుకెళ్లారని చెప్పారు. అయితే అప్పట్లో ప్రాణహాని కలిగించేలా దాడి జరగలేదని, ఈసారి మాత్రం అత్యంత దారుణంగా కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తన్వి మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఒక భావోద్వేగ విజ్ఞప్తి కూడా చేశారు. "నా తమ్ముడు ఎంతో ప్రేమగా ఉండేవాడు. అందరితో కలిసిమెలిసి ఉండేవాడు. నిజానికి అతనికి అమెరికా వెళ్లాలనే ఆసక్తి పెద్దగా లేదు. కానీ మంచి భవిష్యత్తు ఉంటుందనే ఆశతో మేమే ప్రోత్సహించి పంపాం. ఇప్పుడు అతను మాతో లేడు. అందుకే తల్లిదండ్రులందరికీ ఒకటే చెబుతున్నాను.. దయచేసి మీ పిల్లలను అమెరికాకు పంపే విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించండి" అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.

కాగా, తెలంగాణకు చెందిన 28 ఏళ్ల అన్షుల్ కుంచ అమెరికాలోని Pennsylvania రాష్ట్రంలోని Philadelphia నగరంలో నివసిస్తూ ఉద్యోగం చేస్తున్నారు. ఒక బహుళజాతి సంస్థలో పనిచేస్తూనే అదనపు ఆదాయం కోసం వారాంతాల్లో పిజ్జా డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం రాత్రి ఒక అపార్ట్‌మెంట్‌కు పిజ్జా డెలివరీ చేయాలంటూ వచ్చిన ఆర్డర్ మేరకు ఆయన అక్కడికి వెళ్లారు. డెలివరీ పూర్తి చేసి తిరిగి వెళ్తున్న సమయంలో దుండగులు సమీపం నుంచి కాల్పులు జరిపినట్లు సమాచారం. తలపై పలుమార్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా పిజ్జా ఆర్డర్ ఏ ఫోన్ నంబర్ నుంచి వచ్చింది, ఆ ఆర్డర్ వెనుక ఎవరున్నారు, దుండగులతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# జూన్ 15 నుంచి బడులు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

సెలవులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాఠశాలల ప్రారంభాన్ని జూన్ 15కు మార్చినట్లు విద్యాశాఖ స్పష్టం చేసింది. అయితే రెండో శనివారం సెలవు కారణంగా కోల్పోయే పని దినాన్ని భర్తీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జూన్ 13న ఉండే సెలవుకు బదులుగా జులై 11న, రెండో శనివారం రోజున పాఠశాలలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున సాధారణ తరగతులు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థుల నమోదు, పాఠశాలల మౌలిక సదుపాయాల ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తి చేసినట్లు సమాచారం. ప్రభుత్వ, ప్రైవేట్, స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలలకు ఈ మార్పు వర్తించనుంది.

జూన్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలకు హాజరుకానుండగా, ఉపాధ్యాయులు కూడా విద్యా కార్యక్రమాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది.



# విద్యుత్ షాక్ తగిలి బాలుడు మృతి

**ఆదిలాబాద్ జిల్లా జూన్ 07(డి డి 9):-**

సోనాల మండలంలోని సాకేర (సూర్య నగర్) గ్రామానికి చెందిన. ఆడే ధీరజ్ అనే బాలుడు ఆదివారం ఉదయం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. ఇంటిలో ఉన్న కూలర్ కు విద్యుత్ సరఫరా కావడంతో బాలుడు కూలర్ తగిలి మృతి చెందాడు. బాలుని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. విద్యుత్ ప్రమాదానికి గురైన బాలుడిని వెంటనే బోత్ ఆసుపత్రికి తరలించగా బాలుడు అప్పటికే మరణించినట్లు తెలిసింది.





# చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : ఏసీపీ శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 07(డీడీ9 వార్త) :**




మన ఊరు.. మన భద్రత.. మన బాధ్యత' అనే నినాదంతో సామాజిక బాధ్యతలో భాగంగా బోధన్ పోలీసులు పట్టణంలో విస్తృత నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు పట్టణంలోని రాకాసిపేట్, గోసం బస్తీ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సరైన పత్రాలు, లైసెన్సులు లేని 34 ద్విచక్ర వాహనాలను, 6 ఆటోలను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టామని స్పష్టం చేశారు. నేరాలను అదుపు చేయడమే తమ ప్రాథమిక లక్ష్యమని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, వాహన పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద చర్యలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, కృష్ణతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బోధన్ రూరల్ ఎస్సైగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

**బోధన్, నిజామాబాద్, జూన్ 07(డీడీ9 వార్త) :**

బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఆయన తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీపై బోధన్ రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు. ఇప్పటివరకు బోధన్ రూరల్ ఎస్సైగా విధులు నిర్వహించిన మచ్చేందర్ రెడ్డి బదిలీపై జిల్లా స్పెషల్ బ్రాంచ్ కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు తన వంతు కృషి చేస్తానని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. స్టేషన్ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం స్టేషన్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు కొత్త ఎస్సై రాజశేఖర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.



# ఓటరు కార్డు టెన్షన్!

- **లిస్టులో పేరు లేకుంటే రేషన్ కట్?**
- **తెలుగు రాష్ట్రాల్లో రేగుతున్న భయాలు..**
- **సోషల్ మీడియాలో 'ఓటరు లిస్టు' అబద్ధపు ప్రచారం**
- **తీవ్ర ఆందోళనలో ఏపీ, తెలంగాణ ప్రజలు**
- **ఓటు హక్కు పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దంటూ పుకార్లు**
- **బెంగాల్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే భయాలకు కారణం**
- **అక్కడ ఓటర్ల జాబితా నుండి ఏకంగా 63 లక్షల మంది తొలగింపు**
- **అపోహలను కొట్టిపారేసిన ఎన్నికల సంఘం అధికారులు..**
- **తప్పుడు వార్తలను నమ్మొద్దని విజ్ఞప్తి**
- **ఆధార్.. ఓటర్ల లిస్టు సవరణకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడి**
- **ఒకవేళ ఓటు తొలగించబడినా కంగారు వద్దు..**
- **'ఫామ్-6' ద్వారా మళ్లీ పేరు నమోదుకు సువర్ణ అవకాశం**

**హైదరాబాద్, (డిడి9 వార్త)**

తెలంగాణ రాష్ట్రాల్లో త్వరలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ సరికొత్త రాజకీయ సమీకరణాలకు దారితీయడమే కాకుండా, సాధారణ సామాన్య ప్రజల్లో తీవ్రమైన అపోహలకు, ఆందోళనలకు కారణమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల లిస్టును ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, తెలుగు జనాల్లో ఒక రకమైన తెలియని భయం పట్టుకుంది. ఓటర్ల జాబితా ముమ్మర సవరణ తర్వాత ప్రభుత్వం విడుదల చేసే ఫైనల్ లిస్టులో పేరు లేకపోతే, తమకు వస్తున్న ఉచిత రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలు అన్నీ ఆగిపోతాయనే చర్చ గ్రామాల్లో జోరుగా సాగుతోంది.

ఓటర్ల జాబితా సవరణ పూర్తయిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసే తుది డిజిటల్ లిస్టులో ఎవరి పేరైనా మిస్ అయితే, వారి రేషన్ కార్డులతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు తక్షణమే రద్దు అవుతాయంటూ సామాజిక మాధ్యమాల్లో (Social Media) వార్తలు విపరీతంగా ప్రచారమవుతున్నాయి. "రేషన్ లబ్ధిదారులకు అలర్ట్.. ఓటరు లిస్టులో పేరు లేకుంటే మీ కార్డు పూర్తిగా తొలగింపు..?" అంటూ కొందరు వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ వేదికగా పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. దీంతో ఏపీ, తెలంగాణల్లోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ ఓటు భద్రంగా ఉందో లేదో అని తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజల్లో ఈ స్థాయి భయాందోళనలు రేగడానికి అసలు కారణం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన కొన్ని సంచలన పరిణామాలు. అక్కడ ఇటీవల ఏర్పడిన నూతన ప్రభుత్వం.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుండి వివిధ కారణాలతో తొలగించబడిన సుమారు 63 లక్షల మందికి రేషన్ కార్డులను, ఇతర ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను రద్దు చేసే అధికారిక ప్రక్రియను వేగంగా ప్రారంభించింది. అక్కడ ఓటర్ల లిస్టులో పేర్లు లేని వారిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా గుర్తిస్తూ లబ్ధిదారుల జాబితా నుండి ఏరివేస్తుండటంతో.. ఆ ప్రభావం ఎక్కడ తమ మీద కూడా పడుతుందోనని ఇరు రాష్ట్రాల ప్రజలు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఈ అబద్ధపు ప్రచారాలపై కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో పాటు ఉభయ రాష్ట్రాల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించారు. ఈ వార్తలను వారు పూర్తిగా తప్పుడు ప్రచారాలుగా కొట్టిపారేస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఇలాంటి గాలి వార్తలను నమ్మి అస్సలు భయపడాల్సిన అవసరం లేదని, వాట్సాప్ రూమర్లను నమ్మవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు అందించే ప్రజా సంక్షేమ పథకాలకు, ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితా సవరణకు చట్టపరంగా నేరుగా ఎలాంటి లింక్ లేదా సంబంధం ఉండదని వారు క్లియర్ కట్ సమాధానం ఇచ్చారు.

ప్రభుత్వాలు అందించే ఉచిత రేషన్ కార్డులు లేదా సంక్షేమ పథకాలు అన్నీ కూడా పూర్తిగా లబ్ధిదారుల వ్యక్తిగత గుర్తింపు మరియు బయోమెట్రిక్ ఆధారిత వెరిఫికేషన్ ద్వారా మాత్రమే అమలవుతాయని అధికారులు వివరించారు. దీనికి ఓటు హక్కు ఉండటం లేదా లేకపోవడంతో ఎలాంటి ముడి ఉండదన్నారు. ఒకవేళ సాంకేతిక కారణాల వల్లగానీ, ఇల్లు మారడం లేదా బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఇంటికి వచ్చిన సమయంలో అందుబాటులో లేకపోవడం వల్లగానీ ఓటర్ల జాబితాలో పొరపాటున పేరు తొలగించబడినా.. దానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఎప్పుడూ చట్టంలో అందుబాటులో ఉంటాయని ప్రజలకు గుర్తుచేశారు.

ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సమయంలో ఒకవేళ ఎవరిదైనా ఓటు హక్కు తొలగించబడిందని తెలిస్తే బాధితులు ఏమాత్రం కంగారు పడాల్సిన పనిలేదని అధికారులు భరోసా ఇస్తున్నారు. అలాంటి వారు వెంటనే స్మార్ట్‌ఫోన్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా రూపొందించిన 'ఓటర్ హెల్ప్‌లైన్' మొబైల్ యాప్ ద్వారా గానీ, లేదా జాతీయ ఓటర్ల సేవా పోర్టల్ ద్వారా గానీ ఆన్‌లైన్‌లో 'ఫామ్6' దరఖాస్తును సమర్పించి తమ పేరును చాలా సులభంగా తిరిగి నమోదు చేసుకోవచ్చునని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా మొబైల్ యాప్‌లలో దరఖాస్తు చేసుకోవడం రాని గ్రామీణ ప్రాంతాల ప్రజలు లేదా వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. అలాంటి వారు నేరుగా తమ స్థానిక పోలింగ్ కేంద్రం




(పోలింగ్ బూత్) వద్ద నిరంతరం అందుబాటులో ఉండే ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారిని వ్యక్తిగతంగా కలిసి, ఫిజికల్ అప్లికేషన్ సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే తమ ఎన్నికల సంఘం యొక్క ఏకైక లక్ష్యమని, ఎవరి ఓటును అన్యాయంగా తొలగించబోమని అధికారులు స్పష్టం చేశారు.

గల్లీ నుండి ఢిల్లీ దాకా ఏపీ, తెలంగాణ ప్రజలు ఓటరు కార్డు లేకుంటే రేషన్ కార్డులు క్యాన్సిల్ అవుతాయనే వదంతులను నమ్మి మోసపోవద్దని, దళారులను ఆశ్రయించవద్దని రెవెన్యూ విభాగం హెచ్చరించింది. రెండు రాష్ట్రాల్లోనూ త్వరలోనే ప్రతి ఇల్లూ తిరిగే ఓటరు వెరిఫికేషన్ డ్రైవ్ ప్రారంభం కానుందని, ప్రజలు తమ ఓటు హక్కు వివరాలను సరిచూసుకోవాలని కోరారు. పేరు లేని వారు మాత్రమే కొత్తగా నమోదు చేసుకోవాలని, అందరికీ ప్రభుత్వ పథకాలు యథావిధిగా అందుతాయని ఉభయ రాష్ట్రాల సివిల్ సప్లైస్ అధికారులు సైతం స్పష్టమైన ప్రకటన విడుదల చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# గోదావరి జలాలపై ద్రోహం జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి**

తమ పార్టీ నిరంతరం పోరాడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ విషయంలో నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గోదావరి నదీ జలాలను పూర్తిగా మళ్లించే ప్రయత్నం జరుగుతోందని, ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్న తమకు సమాధానం చెప్పలేకపోతే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.

“మమ్మల్ని ఎంత తిట్టినా తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రశ్నించడం ఆపం. మాకు రాజకీయాల కంటే రాష్ట్ర హక్కులే ముఖ్యం. గతంలో కృష్ణా జలాల విషయంలో జరిగిన అన్యాయం ఇప్పుడు గోదావరి విషయంలోనూ పునరావృతమవుతోంది” అని హరీశ్‌రావు అన్నారు.

గోదావరిలో సర్‌ప్లస్ వాటర్ ఉందనే వాదనను ఆయన ఖండించారు. గోదావరి నదిలో అదనపు జలాలు లేవని, ఉన్న నీటిపైనే రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించే ప్రయత్నాలు తెలంగాణకు నష్టదాయకమని అభిప్రాయపడ్డారు.


ఏపీ ముఖ్యమంత్రి కావేరీగోదావరి నదుల అనుసంధానం గురించి మాట్లాడుతున్నారని, పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తరలించే ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. అయితే ఈ విధానం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు.

నదుల అనుసంధానానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తెలంగాణకు నష్టం జరగకుండా ఉండే విధంగా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ఇచ్చామని చెప్పారు. ఇచ్చంపల్లి లేదా సమ్మక్క సాగర్ ప్రాంతాల నుంచి నీటిని తరలించే అవకాశాలను పరిశీలించాలని సూచించామని వివరించారు. అలా చేస్తే తెలంగాణకు కూడా గోదావరి జలాల వినియోగంలో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

పోలవరం నుంచి నీటిని మళ్లించే ప్రతిపాదన వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ భూభాగం నుంచి నీటిని తీసుకునే విషయంలో కర్ణాటక రాష్ట్రం కొన్ని అంశాలకు అంగీకరించిందని గుర్తు చేశారు. ముందుగా తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను పూర్తిగా వినియోగించుకునే అవకాశం కల్పించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని తాము స్పష్టంగా చెప్పామని వెల్లడించారు.

అలాగే కావేరికి తరలించే గోదావరి జలాల్లో తెలంగాణకు సగం వాటా ఇవ్వాలని కూడా డిమాండ్ చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర హక్కులను కాపాడే విషయంలో బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని, గోదావరి జలాల అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణ రైతులు, భవిష్యత్ తాగునీటి అవసరాలు, సాగునీటి ప్రాజెక్టుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జలాల విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని హరీశ్‌రావు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు.



# అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- **ఎల్లమ్మగూడలో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహణ**
- **47 వాహనాల తనిఖీ,**
- **రూ.10 వేల విలువ గల కలప స్వాధీనం, ఒకరిపై కేసు నమోదు**
- **గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

ఉదయం 5 గంటల నుండి ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించినట్లు ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 47 వాహనాలను తనిఖీ చేయడం జరిగిందని అందులో 45 ద్విచక్ర వాహనాలు రెండు ఆటోలు ఉన్నట్లు తెలిపారు. సరైన ధ్రువ పత్రాలు లేని 11 వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అక్రమంగా నిలువ ఉంచిన రూ.10 వేల విలువ గల కలపను స్వాధీనం చేసుకుని, షేక్ రషీద్ s/o అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో నేర నియంత్రణ, భద్రత కోసం ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని, పోలీసు ప్రజల సమన్వయంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఎస్‌హెచ్ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ ఎస్సై విక్రం, ఎస్సై లీలాకృష్ణ, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఏఆర్ ఫోర్స్, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.






# 'మన ఊరు మన బడి – బడిబాట'

- కొడిచెర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఉపాధ్యాయులు

**నిజామాబాద్ పోతంగల్,జూన్ 07 (డిడి9 వార్త):**




నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని కొడిచర్ల గ్రామం లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు మన బడి ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం'లో భాగంగా పోతంగల్ మండలం కొడిచెర్ల గ్రామంలో ఉపాధ్యాయ బృందం బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించింది ఎంపీయూపీఎస్ కోడిచెర్ల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటికి తిరుగుతూ తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'మన ఊరు మన బడి' బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు.

**ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు:**

హెచ్ఎం సుగుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల నాణ్యమైన స్కూల్ యూనిఫామ్‌లు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే బోధన, ఇంగ్లీష్ మీడియంలో విద్య అందిస్తున్నామని వివరించారు.

**పాఠశాల ప్రత్యేకతలు:**

తమ పాఠశాలలో సి.సి.టీవీ నిఘా, నిరంతర సమగ్ర మూల్యాంకనం, గ్రంథాలయం, ఒకటవ తరగతి నుంచే లేఖినీ విద్య, విద్యార్థుల దత్తత వ్యక్తిగత పర్యవేక్షణ, క్రీడా ప్రాంగణం, శారీరక విద్య వంటి సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులకు తెలిపారు. చక్కని విద్యా బోధనకు తాము పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చారు"ప్రైవేట్ స్కూళ్లలో వేలకు వేలు ఫీజులు కట్టి ఇబ్బంది పడే బదులు, అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ బడుల్లో మీ పిల్లలను చేర్పించండి. నాణ్యమైన విద్య, భవిష్యత్తుకు భరోసా మా బాధ్యత" అని హెచ్ఎం సుగుణాకర్ రెడ్డి కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

## మహిళలు, పిల్లల రక్షణే ధ్యేయం

**నిజామాబాద్ జిల్లా, జూన్ 07(డీడీ9 వార్త) :**

సమాజంలో మహిళలు, పిల్లల భద్రతను పెంపొందించేందుకు నిజామాబాద్ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ముప్కాల్ మండలంలోని సిర్పూర్, నిజామాబాద్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద ప్రత్యేక అవగాహన సదస్సులను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ముప్కాల్ ఏఎస్సై, పోలీస్ సిబ్బందితో పాటు సుమారు 340 మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సదస్సుల్లో భరోసా సెంటర్ ద్వారా బాధితులకు అందించే సేవల గురించి సిబ్బంది వివరించారు. ముఖ్యంగా పోక్సో చట్టం, బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై జరిగే దుర్వినియోగం, లింగ వివక్ష వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపుల నివారణ, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు లేదా అత్యవసర సమయంలో ప్రజలు వెంటనే 100, 1098 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం భరోసా సెంటర్ నిరంతరం కృషి చేస్తుందని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.




## యూజీసీనెట్ పరీక్షల వేళ 163 సెక్షన్ అమలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 07(డీడీ9 వార్త) :**



ఈ నెల 22 నుంచి 30 వరకు జరగనున్న యూజీసీనెట్ జూన్ 2026 పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నగరంలోని అర్సపల్లిలో ఉన్న ఏవీ ఎంటర్‌ప్రైజెస్, మల్లారంలోని ఆయేషా కాలేజీ కేంద్రాల్లో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఇద్దరికి మించి గుంపులుగా చేరడాన్ని నిషేధించినట్లు తెలిపారు. అంతేకాకుండా, పరీక్షలు జరిగే సమయాల్లో కేంద్రాల సమీపంలో ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మరియు స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆయా యజమానులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిశిత నిఘా ఉంచుతామని కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు రాసే విద్యార్థులందరూ ప్రశాంతమైన వాతావరణంలో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## మల్కాపూర్ లోని హమ్నపూర్ తాండ లో స్వచ్ఛ భారత్..

**తూప్రాన్ జూన్ 7 (డీడీ9 వార్త )**



మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 404 వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం ఎనిమిదో వార్డులోని న్యూ హమ్నాపూర్ తండాలో చేపట్టారు. ప్లాస్టిక్ ను, చెత్తాచెదారాన్ని తొలగించారు. సిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరచారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తండావాసులను సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ కోరారు.గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం, మెకిన్ యువత పనిచేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, పిఎసిఎస్ డైరెక్టర్ గోపి, వార్డు సభ్యులు, కృష్ణ, వేణు,తిరుపతి, మాజీ వార్డ్ సభ్యులు శ్రీను, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 10 వేల రైతుల అకౌంట్ల లో 100 కోట్ల వడ్ల పైసలు పడ్డాయి.

- తూప్రాన్ డివిజన్ లో 6లక్షల 72 వేల క్వింటాల్ కొనుగోలు
- పోయిన ఏడాది కంటే ఇప్పటికే లక్ష క్వింటాలు అధికంగా కొనుగోలు.. అర్డీఓ జయ చంద్ర రెడ్డి

**తూప్రాన్ జూన్ 7 (డీడీ9 వార్త )**

మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ లోని ఆరు మండల పరిధి లోని 87 వడ్ల కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 6 లక్షల 72 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరిగిందని తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి తెలియజేశారు. మే 6 నాడు వడ్ల కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, నేటికి నెల రోజులు అయిందని, ఇప్పటికే 6 లక్షల 72 వేల క్వింటాలు వడ్ల కొనుగోలు నెల లోపు చేయటం ఒక రకంగా రికార్డు అని ఆయన అన్నారు. గత సంవత్సరం నెలన్నర కాలం లో జూన్ 15 వరకు మొత్తం కొన్న వడ్ల కేవలం 5 లక్షల వేల 70 వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమేనని, గత ఏడాది కంటే ఇప్పటికే లక్ష క్వింటాళ్ల ధాన్యాన్ని ఎక్కువగా సేకరించటం జరిగిందని అర్డీఓ చెప్పారు. ఇప్పటికే 10 వేల 92 మంది రైతుల అకౌంట్లలో ప్రభుత్వం 100 కోట్లు జమ చేసిందని అన్నారు. ఇంకా ఇంకా 4 వేల రైతులకు ఈ వారం లో జమ అయితాయి అని జయ చంద్ర రెడ్డి తెలిపారు




## ఆస్తమా కు ఉచిత ఆయుర్వేద మందు

**మేడ్చల్ (డీడీ9 వార్త):**

పవిత్ర మైన మృగశిరను పురస్కరించు కొని మేడ్చల్ జిల్లా కండ్లకోయ లోని సాయిగీత ఆశ్రమంలో ఉచిత ఆస్థమా వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.8 వ తేదీ ఉదయం 1.33 ని, నుండి గంటల 9 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆస్థమా, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు మృగశిరనాడు ఇచ్చే ప్రత్యేక మందును తీసుకోవడం వల్ల, ఆస్థమా లాంటి సమస్యల నివారణకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకుని, ఆస్థమా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9 0 9 5 3 8 3 9 40, 9491248247 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.






## 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ.. మళ్ళీ ఒక్కటైన 'నలంద' మిత్రబృందం!

**నిజామాబాద్ కోటగిరి, జూన్ 07,( డిడి9 వార్త ) :-**

నిజామాబాద్ జిల్లా. కోటగిరి మండల కేంద్రంలోని నలంద హైస్కూల్ విద్యార్థులు 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కోటగిరి మండల కేంద్రంలోని నలంద హైస్కూల్‌కు చెందిన 20092010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకొని ఆత్మీయంగా కలుసుకున్నారు. కాలం ఎంత వేగంగా పరిగెత్తినా పాఠశాల రోజుల్లోని తీపి జ్ఞాపకాలు చెక్కుచెదరవని నిరూపిస్తూ, ఎంతో కాలంగా దూరంగా ఉన్న మిత్రులందరూ ఒకచోట చేరిన వేళ ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని చిన్ననాటి అల్లరిని, టీచర్ల దగ్గర తిట్లు తిన్న సందర్భాలను, తరగతి గదిలో చేసిన చిలిపి పనులను నెమరువేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న ప్రతి ఒక్కరూ తాము ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డామో, జీవిత ప్రయాణంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ, తాము ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి వారి మార్గనిర్దేశనమే కారణమని కృతజ్ఞతా భావాన్ని చాటుకున్నారు. కేవలం కబుర్లు మాత్రమే ఆనాటి స్కూల్ రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు మనసుకి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయని. 16 ఏళ్ల విరామం తర్వాత కూడా తమ స్నేహబంధం ఏమాత్రం తగ్గలేదని, భవిష్యత్తులో కూడా ఇలాగే క్రమ తప్పకుండా కలుసుకోవాలని తీర్మానించుకుంటూ, ఈ కార్యక్రమం ద్వారా మనుషుల మధ్య ఉండాల్సిన అనుబంధం విలువను మరోసారి చాటిచెప్పారు.

## పెద్దమ్మ కాడి తండాలో మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 07(డీడీ9 వార్త) :**

భీమ్‌గల్ మండలంలోని సికింద్రపూర్ పెద్దమ్మ కాడి తండాలో మహిళల అభివృద్ధిని కాంక్షిస్తూ నిర్మించనున్న మహిళా భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళల సమక్షంలో నాయకులు ప్రత్యేక పూజలు చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఈ మహిళా భవనం తండాలోని మహిళలందరికీ ఒక వేదికగా నిలుస్తుందని, సమావేశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు మరియు సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మహిళా సాధికారతకు ఇటువంటి నిర్మాణాలు ఎంతో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. గ్రామ అభివృద్ధికి ఏ కార్యక్రమం చేపట్టినా తమ పూర్తి సహకారం ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, టౌన్ ప్రెసిడెంట్ పర్సా అనంతరావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అరిగేలా జనార్ధన్, సర్పంచ్ రమేష్, ఉపసర్పంచ్ గణపతి, నాయకులు వాక మహేశ్, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.




## పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన బాబాపూర్ ఉపసర్పంచ్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 07(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదివారం భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మంద గోవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన తమ గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల జాబితాను పీసీసీ అధ్యక్షుడికి విన్నవించారు.

గ్రామంలోని మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను విన్నవించగా, మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సర్పంచ్ భుక్య హంసిబాయ్ రాజారెడ్డి, రహత్ నగర్ ఉపసర్పంచ్ సేవాలాల్ తదితరులు పాల్గొన్నారు.



## టీమిండియా టీ20 కెప్టెన్సీ..
# తొలిసారి స్పందించిన శ్రేయస్ అయ్యర్

- **భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నియామకం**
- **ఇదొక గొప్ప గౌరవమంటూ బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపిన అయ్యర్**
- **ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా గేమ్స్‌కు అయ్యర్ సారథ్యం**

**డిడి9 వార్త:**

భారత టీ20 క్రికెట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎంపికైన విషయం తెలిసిందే. ఈ కీలక బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా స్పందించారు. రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు 2026 ఆసియా గేమ్స్‌లోనూ టీమిండియాను అయ్యర్ నడిపించనున్నాడు. ముంబై టీ20 లీగ్‌లో ఓ మ్యాచ్ అనంతరం మాట్లాడిన అయ్యర్, తనపై నమ్మకం ఉంచిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు.

దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నాడు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే ప్రత్యేకం. అలాంటిది ఇప్పుడు జట్టుకు నాయకత్వం వహించడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, కెప్టెన్సీతో జట్టును విజయాల బాట పట్టించడం 'ఐసింగ్ ఆన్ ది కేక్' లాంటిది. ఇన్నేళ్లుగా నాపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ, మద్దతుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని శ్రేయస్ అయ్యర్ వ్యాఖ్యానించాడు.

**కెప్టెన్సీ మార్పుపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వివరణ**

మరోవైపు కెప్టెన్సీ మార్పుపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టత ఇచ్చాడు. రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేయాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించాడు. సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడం తేలికైన నిర్ణయం కాదని అగార్కర్ అంగీకరించాడు. అయితే, జట్టు దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఈ మార్పు అవసరమైందని తెలిపాడు.

"అన్ని ఫార్మాట్లలో శ్రేయస్ అయ్యర్ స్థిరంగా రాణిస్తున్నాడు. అతడిలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని అతడికి సారథ్య బాధ్యతలు అప్పగించాం" అని అగార్కర్ పేర్కొన్నాడు. ఈ కొత్త బాధ్యతతో శ్రేయస్ అయ్యర్ ముందు పెద్ద సవాలు ఉంది. కెప్టెన్‌గా తనను తాను నిరూపించుకోవడంతో పాటు రాబోయే కీలక టోర్నమెంట్లలో జట్టును విజయపథంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత అతడిపై ఉంది.



## టీమిండియా కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్...
# రోహిత్ శర్మ స్పందన

- **భారత టీ20 జట్టు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ రాణిస్తాడని రోహిత్ ధీమా**
- **ముంబై క్రికెట్ వాతావరణం నాయకత్వ లక్షణాలను నేర్పుతుందని వ్యాఖ్య**
- **సూర్యకుమార్ యాదవ్ స్ఫూర్తిని, శ్రేయస్ నాయకత్వాన్ని ప్రశంసించిన హిట్ మ్యాన్**
- **టీ20 ముంబై లీగ్ యువ ఆటగాళ్లకు గొప్ప వేదిక అని పేర్కొన్న రోహిత్**
- **టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తున్న ఎంసీఏను అభినందించిన రోహిత్ శర్మ**

**డిడి9 వార్త:**

భారత టీ20 జట్టు నూతన కెప్టెన్‌గా నియమితుడైన శ్రేయస్ అయ్యర్‌పై సీనియర్ ఆటగాడు, బ్యాటింగ్ దిగ్గజం రోహిత్ శర్మ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశాడు. ఈ కొత్త బాధ్యతలో శ్రేయస్ తప్పకుండా రాణిస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. అదే సమయంలో, భవిష్యత్ తరాల క్రికెటర్లను తీర్చిదిద్దడంలో టీ20 ముంబై లీగ్ ఒక ముఖ్యమైన వేదిక అని ప్రశంసించాడు.

ముంబైలోని వాంఖడే స్టేడియంలో సోబో ముంబై ఫాల్కన్స్, ట్రయంఫ్ నైట్స్ జట్ల మధ్య జరిగిన టీ20 ముంబై లీగ్ మ్యాచ్ సందర్భంగా రోహిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ 36 బంతుల్లో 61 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి తన జట్టును గెలిపించాడు.

ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ, "ముంబై క్రికెట్‌లో ఆడటం ఎన్నో విషయాలు నేర్పుతుంది. ఇక్కడ ఏదీ సులువుగా రాదు. ప్రతిదీ కష్టపడి సంపాదించుకోవాల్సిందే. కెప్టెన్సీ కూడా అలాంటిదే. చుట్టూ ఉన్నవారి గౌరవాన్ని సంపాదించుకోవాలి" అని అన్నాడు.

సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్‌ల ప్రయాణాలను ఉదాహరణగా చూపుతూ, "సూర్యను చూడండి, అతను 31 ఏళ్ల వయసులో అరంగేట్రం చేశాడు. అంటే అతను ఎప్పుడూ పట్టు వదల్లేదు. ఇప్పుడు శ్రేయస్ టీ20 కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. గతంలో అతను తన ఫ్రాంచైజీకి, ముంబైకి కెప్టెన్‌గా వ్యవహరించిన తీరు చూస్తే, అతను కూడా మంచి విజయం సాధిస్తాడని నేను కచ్చితంగా చెప్పగలను" అని రోహిత్ తెలిపాడు.ఐపీఎల్‌లో ఆడని చాలా మంది యువ ఆటగాళ్లకు టీ20 ముంబై లీగ్ ఒక గొప్ప వేదిక అని, ఫ్రాంచైజీల యజమానులు ఈ టోర్నీని గమనిస్తారని హిట్ మ్యాన్ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ముంబై క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజింక్య నాయక్‌ను, అతని బృందాన్ని రోహిత్ ప్రత్యేకంగా అభినందించాడు.



## ఆఫ్ఘన్‌తో టెస్టు.. 564 పరుగుల వద్ద
# భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్

- **ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టులో భారత్ భారీ స్కోరు**
- **564/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన టీమిండియా**
- **శతకాలతో మెరిసిన శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్**
- **రిషభ్ పంత్, సాయి సుదర్శన్ అర్ధశతకాలు**
- **ఆఫ్ఘన్ బౌలర్ సలీం సఫీ 6 వికెట్ల ప్రదర్శన**

**డిడి9 వార్త:**



ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోర్ సాధించింది. రెండో రోజు ఆట రెండవ సెషన్‌లో టీమిండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. భారత బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (101) శతకాలతో కదం తొక్కారు.

ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చేలాయించారు. గిల్, రాహుల్ సెంచరీలతో బలమైన పునాది వేయగా, మిడిలార్డర్‌లోనూ పరుగుల వరద కొనసాగింది. రిషభ్ పంత్ (81), సాయి సుదర్శన్ (81) అర్ధశతకాలతో రాణించి జట్టు స్కోరును మరింత పెంచారు. వాషింగ్టన్ సుందర్ 52 పరుగులతో అజేయంగా నిలిచాడు. మహ్మద్ సిరాజ్ 12 బంతుల్లోనే 22 పరుగులు చేయడం విశేషం. అందులో 4 ఫోర్లు, 1 సిక్సు ఉండడం సిరాజ్ దూకుడుకు నిదర్శనం. కొత్త కుర్రాడు మానవ్ సుతార్ 2 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 28 పరుగులు చేశాడు.

భారత బ్యాటర్లు విజృంభించినప్పటికీ, ఆఫ్ఘనిస్థాన్ బౌలర్ మహ్మద్ సలీం సఫీ తన అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. భారత ఇన్నింగ్స్‌లో ఏకంగా 6 వికెట్లు పడగొట్టాడు. అయినప్పటికీ భారత జట్టు భారీ స్కోరు సాధించడాన్ని అడ్డుకోలేకపోయాడు.

## అరంగేట్రంలోనే మానవ్ సుతార్ అదుర్స్.. ఆఫ్ఘన్‌పై పట్టుబిగించిన భారత్

- **మొహాలీలో భారత్-ఆఫ్ఘన్ ఏకైక టెస్టు**
- **564 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్**
- **కెరీర్ లో తొలి టెస్టు ఆడుతున్ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు 3 వికెట్లు**
- **రెండో రోజు ఆట ముగిసేసరికి ఆఫ్ఘనిస్థాన్ 113/5**
- **451 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియా**
- **ఫాలో-ఆన్ గండంలో ఆఫ్ఘన్ జట్టు**

**డిడి9 వార్త:**



ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు సాధించిన గిల్ సేన, అనంతరం బౌలింగ్‌లోనూ చెలరేగి ఆఫ్ఘన్ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆఫ్ఘనిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత జట్టు కంటే ఇంకా 451 పరుగులు వెనుకబడి ఉంది. అరంగేట్రం చేసిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 3 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు.

అంతకుముందు, 564/8 పరుగుల వద్ద భారత్ తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) బాధ్యతాయుతమైన అర్ధశతకం సాధించగా, మహమ్మద్ సిరాజ్ (22) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి కాగానే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, బౌలర్లకు రెండు సెషన్ల సమయం ఇచ్చాడు.

తొలి ఇన్నింగ్స్ ఆడేందుకు బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్ ఆదిలోనే తడబడింది. పదునైన బంతులతో అదరగొట్టిన మానవ్ సుతార్, అబ్దుల్ మాలిక్‌ను తన తొలి వికెట్‌గా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతితో సెదిఖుల్లా అటల్ వికెట్ తీశాడు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సుతార్, రహ్మానుల్లా గుర్బాజ్‌ను కూడా ఔట్ చేశాడు.

ఒకవైపు వికెట్లు పడుతున్నా, రహ్మత్ షా (43 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెట్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆఫ్ఘన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కెప్టెన్ హష్మతుల్లా షాహిదితో కలిసి 36 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కాసేపటికే అఫ్సర్ జజాయ్, సుతార్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ ఫాలోఆన్ గండంలో పడింది. రేపు ఆటకు మూడు రోజు కాగా, ఆఫ్ఘన్ జట్టును వీలైనంత త్వరగా ఆలౌట్ చేయాలని టీమిండియా భావిస్తోంది.

## టీజీ 20 ఆటగాళ్ల వేలం: తిలక్ వర్మ కోసం పోటాపోటీ...
# డీజీపీ సీవీ ఆనంద్ తనయుడికి రూ.17 లక్షలు

- **హైదరాబాద్‌లో ప్రారంభమైన తొలి టీజీ20 లీగ్ ఆటగాళ్ల వేలం**
- **రికార్డు స్థాయిలో రూ.33 లక్షలకు అమ్ముడైన తిలక్ వర్మ**
- **తిలక్‌ను దక్కించుకున్న మెదక్ ఫాల్కన్స్ ఫ్రాంచైజీ**
- **మహ్మద్ సిరాజ్‌కు రూ.14 లక్షలు, సీవీ మిలింద్‌కు రూ.17 లక్షలు**
- **ఎనిమిది ఫ్రాంచైజీల మధ్య హోరాహోరీగా సాగుతున్న వేలం పాట**

**డిడి9 వార్త:**

తెలంగాణలోని స్థానిక క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ టీ20 (టీజీ20) లీగ్ తొలి సీజన్ ఆటగాళ్ల వేలం ప్రక్రియ ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. రామోజీ ఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరుగుతున్న ఈ వేలంలో యువ సంచలనం, టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ రికార్డు ధర పలికాడు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మను 'మెదక్ ఫాల్కన్స్' ఫ్రాంచైజీ ఏకంగా రూ.33 లక్షల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది.

ఈ వేలం కోసం సుమారు 1300 మందికి పైగా హెచ్ సీఏ రిజిస్టర్డ్ క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, తుది జాబితాలో 160 మంది ఆటగాళ్లు వేలానికి వచ్చారు. 8 ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. ప్రతి ఫ్రాంచైజీకి ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు రూ.60 లక్షల పర్సును కేటాయించారు. ఐకాన్ ప్లేయర్ల జాబితాలో ఉన్న తిలక్ వర్మ కోసం మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన బిడ్డింగ్‌లో మెదక్ ఫ్రాంచైజీ భారీ ధరకు తిలక్‌ను సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఇక టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను 'వరంగల్ వారియర్స్' ఫ్రాంచైజీ రూ.14 లక్షలకు దక్కించుకుంది. అయితే, సిరాజ్ కంటే ఎక్కువగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తనయుడు, దేశవాళీ సీనియర్ పేసర్ సీవీ మిలింద్ ధర పలకడం విశేషం. మిలింద్‌ను 'అన్విత ఖమ్మం ఏసెస్' జట్టు రూ.17 లక్షలకు కొనుగోలు చేసింది. ఇది దేశవాళీ టోర్నీల్లో ఆటగాళ్ల ప్రదర్శనకు ఫ్రాంచైజీలు ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

ఇతర కీలక ఆటగాళ్లలో రవికిరణ్‌ను పాలమూరు స్ట్రైకర్స్ రూ.13 లక్షలకు, రవితేజను మెదక్ జట్టు రూ.12 లక్షలకు, అమన్ రావును వరంగల్ వారియర్స్ రూ.12 లక్షలకు కొనుగోలు చేశాయి. తనయ్ త్యాగరాజన్ (రంగారెడ్డి), ప్రగ్యాన్ రెడ్డి (పాలమూరు), అజయ్‌దేవ్ గౌడ్ (హైదరాబాద్), మహ్మద్ ఆర్ఫాజ్ అహ్మద్ (నల్గొండ), అభిరత్ రెడ్డి (హైదరాబాద్) వంటి ఆటగాళ్లు రూ.11 లక్షల చొప్పున ధర పలికారు. మరో ఐకాన్ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్‌ను కరీంనగర్ డైమండ్స్ రూ.8 లక్షలకు సొంతం చేసుకుంది.

ప్రముఖ ఆక్షనీర్ చారు శర్మ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ ప్రొఫెషనల్‌గా సాగుతోంది. ఈ లీగ్‌లో మొత్తం 8 జట్ల మధ్య 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఈ టోర్నమెంట్‌కు వేదిక కానుంది. ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు చూపిస్తున్న ఆసక్తి, కురిపిస్తున్న కాసుల వర్షం చూస్తుంటే తొలి సీజన్ టీజీ20 లీగ్ విజయవంతం కావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలుసు కదా ఇది ముగింపు మాత్రమే కాదని..




బీటౌన్ యంగ్ బ్యూటీ దిశా పటాని, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఆవారాపన్ 2'. 2007లో విడుదలై కల్ట్ క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్టుపై బాలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్ర ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ఈ సినిమా నుంచి మరో అప్డేట్ వచ్చింది. 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ టీజర్ జూలై 1న విడుదల కానున్నట్లు బాలీవుడ్ ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. ఈ టీజర్ దిశ, ఇమ్రాన్ మధ్య ఉండబోతుందని తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ప్రమోషన్స్ అప్పుడే స్టార్ట్ చేసిన దిశ.. సోషల్ మీడియాలో అదిరిపోయే పోస్టులతో కుర్రకారుని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. కాగా.. 'అభిమానులకు తెలుసు ఇది కేవలం ముగింపు మాత్రమే కాదని.. అతను మీ కోసమే మళ్లీ తిరిగి వచ్చాడు' అంటూ మేకర్స్ ఇటీవల రిలీజ్ చేసిన 'ఆవారాపన్ 2' ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమాపై మరిన్ని ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌ను విశేష్ ఫిలిమ్స్ నిర్మిస్తుంది.

## కొన్నాళ్లకు నాపై ఒత్తిడి పెరిగింది.. అందుకే వాటికి దూరం అయ్యా

హీరోయిన్ తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్నది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండటంపై షాకింగ్ అభిప్రాయాన్ని పంచుకుంది తాప్సీ. 'సోషల్ మీడియాలో తక్కువగా కనిపించాలని గత ఏడాదే నిర్ణయం తీసుకున్నా. దీనికి ప్రత్యేకంగా ఎలాంటి కారణం లేదు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. నేను సోషల్ మీడియా స్టార్ట్ చేసిన కొన్నాళ్లకు అది పరుగు పందెంలా అనిపించడం. అందరూ ఏదో ఒకటి పోస్ట్ చేస్తూ, ఎప్పుడూ కనిపిస్తూ ఉండాల్సిందే అన్న ఒత్తిడి పెరిగింది. అందుకే నా జీవితాన్ని ప్రశాంతంగా గడపడానికి, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడానికి కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆ నర్ణయం తీసుకున్నా'. అని తెలిపింది.





## మూడు రోజుల్లోనే ఆ మైలురాయిని దాటిన 'పెద్ది'.. నెక్స్ట్ టార్గెట్ అదేనా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మూడు రోజుల బాక్సాఫీస్ కలెక్షన్లను మూవీ బృందం అధికారికంగా ప్రకటించింది. మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 'పెద్ది' రూ.236.7 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా వెల్లడించారు. దీంతో ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే 200 కోట్ల మార్క్‌ను దాటి, ఇప్పుడు 300 కోట్ల లక్ష్యంపై దూసుకెళ్తోంది.

ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాకు లభిస్తున్న స్పందనను బట్టి చూస్తే నాలుగో రోజుకే 'పెద్ది' 300 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే పూర్తి రన్ ముగిసే నాటికి ఈ సినిమా భారీ వసూళ్లు సాధించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. జగపతిబాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్ నిర్మించింది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

## గట్ట కుస్తీ2 సంగీత విన్యాసానికి సమయం ఆసన్నమైంది..




విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన చిత్రం 'గట్ట కుస్తీ'. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 2022లో విడుదలై తెలుగు, తమిళ భాషల్లో భారీ విజయాన్ని అందుకుంది. ఇదే జోష్‌తో ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'గట్ట కుస్తీ2' రాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మూవీ జులై 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతుండగా.. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్ర బృందం తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈ మేరకు 'మ్యూజిక్ డైరెక్టర్ షాన్ రోల్డన్ సంగీత విన్యాసానికి సమయం ఆసన్నమైంది.. గట్ట కుస్తీ 2 నుంచి మొదటి పాట 'సంభవకారి' జూన్ 9న రాబోతున్నది' అంటూ ఓ పోస్టర్ షేర్ చేశారు. కాగా.. చల్ల అయ్యావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కరుణాస్, మునీష్కాంత్, కాళీ వెంకట్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'గట్ట కుస్తీ' లాగే ఈ సీక్వెల్ కూడా అవుట్ అండ్ అవుట్ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతుంది అంటూ మేకర్స్ ప్రకటించగా అంచనాలు మరింత పెరిగాయి.

## ఓటీటీలోకి 'రమణి కల్యాణం'.. స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?

సూర్య వశిష్ట, దీప్షిక జంటగా నటించిన ఎమోషనల్ డ్రామా 'రమణి కల్యాణం'. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్‌పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల నిర్మించారు. సమ్మర్ స్పెషల్‌గా మే 22 న థియేటర్స్‌లోకి వచ్చి పర్వాలేదు అనిపించుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సన్ నెక్స్ట్ సొంతం చేసుకోగా.. ఈనెల 12 నుంచి స్ట్రీమింగ్‌కు రాబోతున్నట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చింది. ఈ మేరకు 'మీ ఆత్మకు ఉపశమనం కలిగించేవారే మీకు సరైన జోడి అయినప్పుడు' అంటూ ఓ క్యూట్ పోస్టర్‌ను షేర్ చేశారు.




## 'రణబాలి'... వందరోజుల ప్రయాణం



విజయ్ దేవరకొండ రష్మిక జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని టీ సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే వంద రోజుల చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. తాజాగా గండికోటలో ఓ కీలక షెడ్యూల్‌ని ముగించినట్లు తెలియజేసింది. వారం పాటు సాగిన ఈ షెడ్యూల్‌లో విజయ్ రష్మికలపై భావోద్వేగభరిత సన్నివేశాల్ని చిత్రీకరించినట్లు తెలిపింది. ఇది 1854 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న సినిమా. విజయ్ ఇందులో శక్తిమంతమైన యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా 90శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుందని.. దీన్ని సెప్టెంబరు 11న విడుదల చేసేందుకు అన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అజయ్ అతుల్ సంగీతమందిస్తుండగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు.

## కర్మపై నాకు చాలా నమ్మకం ఉంది.. అందుకే అలాంటి పనులు చేస్తా..



సేవ చేయడంలో ఉన్న ఆనందమే వేరు అంటుంది బాలీవుడ్ క్యూట్ బ్యూటీ మృణాల్ ఠాకూర్. సీతారామం, హాయ్ నాన్న వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో సైతం ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న ఈ హీరోయిన్.. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో అవకాశాలు అందుకుంటూ వరుస సినిమాలు చేస్తుంది. అలాగే త్వరలో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ మేరకు కోలీవుడ్ స్టార్ ధనుష్ సినిమాలో చాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. ఇలా సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ.. సేవా చేయడంలో కూడా ఒక తృప్తి ఉంటుంది అంటూ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'ఇప్పటివరకు ఏదేదో ఆనందాన్ని ఇస్తుందని నేను అనుకున్నా. కానీ అది నిజం కాదు.. జీవితంలో మనకు నిజమైన ఆనందం ఉన్నదానిలో ఇతరులకు ఇవ్వంలోనే ఉంటుంది. పెద్ద మొత్తంలో కాకపోయినా మనకు ఉన్నదానిలో కొంత లేనివారికి సాయం చేయాలి. ముఖ్యంగా నాకు కర్మపై చాలా నమ్మకం ఉంది. అయితే చేసిన సాయానికి ప్రతిఫలం ఉంటుందా? లేదా? అనేది మాత్రం ఆలోచించను. నాకు తోచిన సాయం చేస్తుంటాను. దాని వల్ల ఎవరైనా సంతోష పడితే అంతే చాలు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మృణాల్ కామెంట్స్ వైరల్ అవుతుండగా.. ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజన్లు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.